క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ : అడవిదేవులపల్లి ఫీడర్ కింద లైన్ వర్క్ చేస్తున్నందున దామరచర్ల మండలంలోని తిమ్మాపురం, తాళ్లవీరప్పగూడెం, సబ్ స్టేషన్ల పరిధిలో గల అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ అబ్దుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న అధికారులు

దేవరకొండ : ప్రయాణికురాలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆర్టీసీ సిబ్బంది ఆమెకు అందజేసి నిజాయితీని చాటుకున్నారు. ఓ మహిళా ప్రయాణికురాలు శుక్రవారం దేవరకొండ బస్టాండ్‌కు వచ్చింది. ఆమె వెళ్లాల్సిన బస్సు రావడంతో తన సెల్‌ఫోన్‌ను అక్కడే మర్చిపోయి వెళ్లిపోయింది. ఇది గమనించిన కంట్రోలర్ దశరథం సెల్‌ఫోన్‌ను డిపో అధికారులకు అందజేశారు. ఫోన్‌లో ఉన్న నంబర్ల ఆధారంగా సదరు ప్రయాణికురాలిని గుర్తించి ఫోన్‌ను ఆమెకు అప్పగించారు.

చదువుకుంటేనే భవిష్యత్‌కు భరోసా

హాలియా : చదువుకుంటేనే భవిష్యత్‌కు భరోసా లభిస్తుందని ఎంఈఓ కృష్ణమూర్తి అన్నారు. పట్టణానికి చెందిన కుకడాల రాములమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, శ్రీశ్లోక స్కూల్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ కుకడాల ఆంజనేయులు శుక్రవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. రాబోయే కొద్ది రోజుల పాటు విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ సీఐ అర్కపల్లి ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, మజ్జిగ అశోక్ రెడ్డి, చలమల వెంకట్‌రెడ్డి, యడవెల్లి సుధారాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న సత్యనారాయణ

దేవరకొండ : త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని దేవరకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం దేవరకొండ మండలం ముదిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నల్లమాద నారాయణరెడ్డి, శ్యాంసన్, లకుమారపు మల్లయ్య, నారాయణసింగ్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో నేడు రథోత్సవం



దేవాలయంలో కొలువుదీరిన స్వామివారు

దేవరకొండ : దేవరకొండ మండలం ముదిగొండ శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 26 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఈ నెల 5వరకు కొనసాగనున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు స్వామి వారికి దేవాలయంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేడు దేవాలయంలో స్వామి వారి రథోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నారు.

నీరు ఇంకట్లే.. ముమ్ముందు ఇక్కట్లే!

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో కనిపించని ఇంకుడు గుంతలు
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం



మిర్యాలగూడలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మట్టితో పూడుకుపోయిన ఇంకుడుగుంత

మిర్యాలగూడ టౌన్ : అడుగంటుతున్న భూగర్భ జలాలను పెంచేందుకు మానవ ప్రయత్నంగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా మిర్యాలగూడ మున్సిపాలిటీలో మాత్రం అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ నూతన భవనం నిర్మాణం చేపట్టినా తప్పనిసరిగా ఇంటి అవరణ, పరిసర ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపడతామని హామీలు ఇవ్వడంతో పాటు మొత్తం స్థలంలో చదరపు మీటరుకు 25 రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి ఇంటి యాజమాని వద్ద రూ.2500 వసూలు చేస్తారు. నిర్మించిన తరువాత ఫొటోలతో పాటు ఆధారాలు చూపిస్తే.. ధరావత్ కోసం చెల్లించిన డబ్బులను తిరిగి ఇంటి యజమానికి చెల్లిస్తారు. మున్సిపాలిటీ పరిధిలో ధరావత్ తీసుకునేవారే లేరంటే..పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

300 గజాలు పైబడిన ప్రతి ఇంటికీ ఇంకుడుగుంత తప్పనిసరి

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 300 గజాలు పైబడిన విస్తీర్ణంలో నిర్మించే ప్రభుత్వ, ప్రైవేటు భవనాలల్లో ఇంకుడు గుంతలు తప్పని సరిగా ఉండాలి. ఈ విస్తీర్ణంలో నిర్మించే భవనాల నిర్మాణ అనుమతుల సమయంలో ఇంకుడు గుంతల నిర్మాణం పేరిట చార్జీలను యాజమానినే చెల్లించాల్సి ఉంటుంది. ఇంకుడు గుంతలు నిర్మించిన తరువాత గుంతలు నిర్మించినట్లు యాజమానికి డిక్లరేషన్ ఇస్తేనే మున్సిపల్ అధికారులు తనిఖీలను చేసి గతంలో చెల్లించిన చార్జీలను తిరిగి యాజమానికి చెల్లిస్తారు. ఇప్పటి వరకు ఎవరు కూడా డిక్లరేషన్ ఇవ్వలేదు. మున్సిపాలిటీలో అధికారికంగా 300 గజాల లోపు 170 నిర్మాణాలు ఉండగా అందులో 106 నివాస ప్రాంతాల్లో మాత్రమే ఇంకుడు గుంతలు ఉన్నట్లు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు గుర్తించారు. అదే విధంగా 44 నిర్మాణాల్లో ఇంకుడు గుంతల సర్వే చేయడం జరిగింది. మరో 20 ఇంకుడు గుంతల నిర్మాణాలు తాజాగా పూర్తి అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ స్థలాల్లోని కార్యాలయాల్లో గతంలో నిర్మించిన ఆరు ఇంకుడు గుంతలు వినియోగంలో ఉన్నట్లు అధికారులు అంటున్నారు. మిర్యాలగూడలో ఇంకుడు గుంతలు నిర్మించని 100 మంది ఇంటి యాజమానులకు నోటీసులను జారీ చేయడం జారీ చేశామని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చెబుతున్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

పట్టణ ప్రణాళిక విభాగంలో సిబ్బంది కొరత నెలకొంది. ఆయా ప్రాంతాలకు చెందిన బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు దృష్టి సారించినా ఇంకుడు గుంతల నిర్మాణం పురోగతి సాధించే అవకాశం ఉంది. పట్టణ ప్రణాళిక విభాగంలో ఎనిమిది మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా టీపీబీఓలు ఇద్దరు, జూనియర్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉండగా ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ కింద కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు చైన్‌మన్‌లను ఏర్పాటు చేసుకొని నడిపిస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న టీపీఓ సూర్యాపేట, హాలియా మున్సిపాలిటీలు, టీపీఎస్‌కు నేరేడుచర్ల, నందికొండ మున్సిపాలిటీలకు అదనపు బాధ్యతలను స్వీకరిస్తున్నారు. దీంతో ఇంకుడు గుంతల నిర్మాణాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించలేకపోతున్నారు. పలు కాలనీలో ప్రజలతో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేసి , నిర్మాణ పనులను పర్యవేక్షించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల్లోను ఇంకుడు గుంతల నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉంది.

అవగాహన కల్పిస్తాం



మున్సిపాలిటీలో 200గజాల పైబడిన నిర్మాణాల్లో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాల్సిందే. ఈ విషయంపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తాం. పట్టణ ప్రణాళిక విభాగానికి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించి, కొత్త ఇళుల నిర్మించే వారు ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలందరికీ అందించడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడులు తిరుమలగిరి సురేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది, ఆర్‌పీలు, వార్డు ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే లక్ష్యంతో పాటు పథకాలను పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం శాస్త్రీయ బద్ధంగా సర్వే కొనసాగించిందని తెలిపారు. ప్రజల కోరిక మేరకు రెండవ విడత సర్వే శుక్రవారంతో ముగిసిందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, తహసీల్దార్ హరిబాబు, బీసీ కార్పొరేషన్ జిల్లా ఈడీ నిజామ్‌అలీ అఫ్సర్, మిర్యాలగూడ డివిజనల్ అధికారిని ఎస్తేర్, మున్సిపల్ డీఈఈ వెంకన్న తదితరులున్నారు.

చెర్వుగట్టులో వైభవంగా లక్ష పుష్పార్చణ



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టులో శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం లక్ష పుష్పార్చణ నిర్వహించారు. అలాగే రాత్రి అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమావాస్య రాత్రి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సతీశ్‌శర్మ, సురేష్ శర్మ, శ్రీకాంత్ శర్మ వివిధ అర్చకులు లక్ష పుష్పార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈఓ నవీన్‌కుమార్, పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా దేవాలయ శాఖ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



రైస్ మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని, ప్రతి రైస్ మిల్లర్ ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో యాసంగిలో ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్స్ ఓనర్లతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు సాకులు చూపి ఇబ్బందులకు గురిచేయవద్దని, ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు తిరిగి జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, భోగవెల్లి వెంకటరమణచౌదరి తదితరులు ఉన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెరుగుతుంది

మిర్యాలగూడ : కరాటే శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని రైస్‌మిల్ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో సుమన్ షోటోఖాన్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సినీ హీరో సుమన్ విద్యార్థులకు కరాటే బెల్ట్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు కరాటే దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్‌ను ప్రవేశపెట్టాలి

- సినీ హీరో సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న నటుడు సుమన్

మిర్యాలగూడ : ప్రభుత్వం ప్రతి పాఠశాలలో మార్షల్ ఆర్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించాలని సినీ హీరో సుమన్ కోరారు. శుక్రవారం పట్టణంలోని రెడ్డికాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మరక్షణ కోసం పాఠశాల స్థాయిలో 5వ తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్‌లో కరాటే ప్రవేశపెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కోరారు. మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని, దాడులను ఎదుర్కొనేందుకు విద్యార్థి దశ నుంచే కరాటే అవసరమన్నారు. సమావేశంలో షోటోఖాన్ నిర్వాహకుడు బూడిద సైదులు, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, చిలుకూరి బాలు, గాయం ఉపేందర్‌రెడ్డి, గుడిపాటి నవీన్, దేశిరెడ్డి శేఖర్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

టైలర్ల సమస్యలు పరిష్కరించాలి



టైలర్స్ డే సందర్భంగా హాలియాలో ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు



అడవిదేవులపల్లిలో కేక్ కట్ చేస్తున్న టైలర్లు

హాలియా : టైలరింగ్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని హాలియా టైలర్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిటిపాముల శ్రీనివాస్ అన్నారు. ది హాలియా టైలరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ టైలరింగ్ దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ సృష్టికర్త విలియం హోవే చిత్రపటానికి హాలియా టైలరింగ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ సంఘం గౌరవ అధ్యక్షుడు గడ్డం రమణయ్య, ఆదిమూల ఆంజనేయులు, సహాదారులు గడ్డం కృష్ణ, సెక్రటరీ మునని యాదగిరి, కోశాధికారి రాము, వీటీ బ్రహ్మచారి, శ్రీనివాస చారి, చైతన్య నాయక్, గడ్డం శ్రీను, రాపోలు మంగయ్య, పున్న కృష్ణ, శంకర్, కరుణాకర్, జగన్నాథం, శ్రీను నాయక్, పున్న శివ, సత్యనారాయణ చారి తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలో శుక్రవారం టైలర్స్ డే ను టైలర్లు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టైలర్లు ఎస్‌కె బాబావలి, కాశీం, పసుపులేటి పున్నారావు, బండి వెంకటేశ్వర్లు, పుసుపులేటి సైదయ్య, నర్సయ్య, శ్రీను, కోటి, అంజి, మధార్, వాసు, అనిల్ తదితరులు ఉన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

- సినీ హీరో సుమన్



మిర్యాలగూడ : డాహిల్ హైస్కూల్‌లో ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న సినీ హీరో సుమన్



త్రిపురారం : నిడమనూరు మండలం రాజన్నగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో..

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులు చదువుతో పాటు పరిశోధనలపై దృష్టి సారించాలని, సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సినీ హీరో సుమన్ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డాహిల్ హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డి.శేఖర్‌రెడ్డి, వ్యాపారవేత్త గుడిపాటి నవీన్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ సాయి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వభారతి పాఠశాలలో..

పట్టణంలోని విశ్వభారతి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సైన్స్ ప్రయోగాలను పాఠశాల సీఈఓ రవికుమార్ పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మిర్యాలగూడ : విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొర్ర కృష్ణ కాంత్‌నాయక్ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, ముంతాజ్, సంతోష్, అనిత, జ్యోతి, ధనలక్ష్మి, అశ్విని, స్పందన, బేబిరాణి, కాంతయ్య, పద్మావతి, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

పెద్దఅడిశర్లపల్లి : పీఏపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాయి కృష్ణవేణి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫైర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పరిజ్ఞానంతో రూపొందించిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. సైన్స్ ఫేర్‌ను పాఠశాల కరెస్పాండెంట్ చంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓ రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మిర్యాలగూడ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని సామాజికవేత్త డాక్టర్ రాజు అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, సమూహ రైటర్స్ ఫోరం ఉమ్మడి జిల్లా కన్వీనర్ కస్తూరి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, కొండల్‌రెడ్డి, సుదర్శన్, యాదయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

శాస్త్ర ప్రచారంలో జన విజ్ఞాన వేదిక విశేష కృషి

హాలియా : జన విజ్ఞాన వేదిక సంస్థ గత 37 సంవత్సరాలుగా శాస్త్ర ప్రచారంలో విశేష కృషి చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోలా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక టైం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ విమల, జిల్లా ఉపాధ్యక్షుడు కోటిరెడ్డి, టైం స్కూల్ ప్రిన్స్‌పాల్ కోటిరెడ్డి, సైదులు, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తరి రాములు, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం డి.బాలోజీ, ఉపాధ్యాయులు కృష్ణయ్య, కృష్ణ, షబ్బీర్, శ్రీనునాయక్, సురేందర్, సంధ్య, షాహీన్‌బేగం, సైదులు, రామయ్య, జ్యోతి, పాల్గొన్నారు.

జీవితంలో సైన్స్ భాగం

త్రిపురారం : మానవుని జీవితంలో సైన్స్ ఒక భాగమని ప్రధానోపాధ్యాయుడు శ్రీవెంకట్ అన్నారు. శుక్రవారం నిడమనూరు మండలంలోని రాజన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనందరం విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదయ్య, సుబ్బలక్ష్మి, శ్రీధర్, సైదులు, రావు, గౌతమ్, పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించవచ్చు

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు పట్టుదలతో చదివి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చని మిర్యాలగూడ టూ టౌన్ సీఐ నాగార్జున అన్నారు. శుక్రవారం పట్టణంలోని శాస్త్ర స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శించిన సైన్స్ నమునాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎం.చంద్రశేఖర్, కరస్పాండెంట్ పి.శ్రీధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సిందూ ఉన్నారు.



హాలియా : టైం స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి



పెద్దవూర : జెడ్పీహెచ్ఎస్‌లో సైన్స్ ఎగ్జిబిట్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ రాములు



పెద్దఅడిశర్లపల్లి : ఎగ్జిబిట్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎస్సీ హాస్టల్‌లో అధికారుల రాత్రి బస



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్సీ వెల్ఫేర్ డీడీ కోటేశ్వర్‌రావు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని నాగార్జుననగర్‌లో గల ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌ను శుక్రవారం రాత్రి ఎస్సీ వెల్ఫేర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వర్‌రావు, ఏఎస్‌డబ్ల్యూఓ వెంకట కృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్ రికార్డులను పరిశీలించి.. హాస్టల్‌లోనే నిద్రచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు హాస్టల్‌లో నీటి సమస్య ఉందని, విద్యుత్ సౌకర్యం కూడా సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వారి దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థుల సమస్యలపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తానని తెలిపారు. వారి వెంట వార్డెన్లు అమర్‌నాథ్, ఖాజా తదితరులున్నారు.

'హామీలను అమలు చేయడంలో విఫలం'

మిర్యాలగూడ : గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి.. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మట్టయ్య మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యా, వైద్యం, మహిళ, యువజన, సంక్షేమ రంగాలకు 40శాతం నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించి ఢిల్లీకి అఖిలపక్ష పార్టీ బృందాన్ని తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, భరత్, మోహన్‌నాయక్, మారయ్య, మల్లేష్, లాలునాయక్, ఇమ్మానియేల్, మౌనిక పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



అడవిదేవులపల్లి : మండలంలోని ఉల్సాయిపాలెంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.రమేష్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, అజీమా, అంగన్‌వాడీ టీచర్ శిరీష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు